# డిస్ట్రిబ్యూషన్ సెంటర్ సందర్శన

**ఎన్నికల సామగ్రి పంపిణీ తీరుతెన్నులను పరిశీలించిన కలెక్టర్ శశాంక, ఎన్నికల సాధారణ పరిశీలకుడు రాజేందర్‌కుమార్ కటారియా**



చేవెళ్లలో డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌ను సందర్శించిన రిటర్నింగ్ అధికారి, రంగారెడ్డి కలెక్టర్ శశాంక




షాబాద్, మే 12: పార్లమెంటు ఎన్నికల పోలింగ్ నిర్వహణ కోసం సిబ్బందికి ఎన్నికల సామగ్రి పంపిణీ నిమిత్తం ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ సెంటర్లను రిటర్నింగ్ అధికారి, రంగారెడ్డి కలెక్టర్ శశాంక ఎన్నికల సాధారణ పరిశీలకుడు రాజేందర్‌కుమార్ కటారియాతో కలిసి ఆదివారం సందర్శించారు. చేవెళ్ల అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించి చేవెళ్ల మండలం గొల్లపల్లి గ్రామంలో బండారి శ్రీనివాస్ ఇన్‌స్టిట్యూట్‌లో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌లో చేపట్టిన ఎన్నికల సామగ్రి పంపిణీ తీరుతెన్నులను కలెక్టర్ పరిశీలించారు. తాగునీటి వసతి, వైద్యశిబిరం, అల్పాహారం, భోజనం వసతి, షామియానాల వంటి ఇతర అన్ని వసతులను పరిశీలించారు. పీవో, ఏపీవో, ఓపీవోలతో కూడిన బృందాలన్నీ హాజరయ్యారా లేదా అని కలెక్టర్ ఆరా తీశారు. ఈవీఎంల పనితీరును ప్రయోగాత్మకంగా వివరిస్తున్న తీరును గమనించారు. ఎలాంటి లోటుపాట్లు, గందరగోళానికి తావులేకుండా సిబ్బందికి పోలింగ్ సామగ్రిని పక్కాగా అందించాలని, చెక్ లిస్టు ఆధారంగా ఎన్నికల నిర్వహణకు అవసరమైన సామగ్రి అందినదా, లేదా అన్నది సరి చూసుకోవాలని కలెక్టర్ సూచించారు. పోలింగ్ సిబ్బందితో పాటు ఓటింగ్ కేంద్రాల వద్ద బందోబస్తు నిర్వహించే పోలీసు సిబ్బందిని తరలించేందుకు సిద్ధంగా ఉంచిన వాహనాలను పరిశీలించి, సకాలంలో నిర్దేశిత పోలింగ్ కేంద్రాలకు సిబ్బంది చేరుకునేలా పర్యవేక్షణ జరపాలని అధికారులను ఆదేశించారు. ఎలాంటి ఇబ్బందులు తలెత్తినా తమ దృష్టికి తేవాలని ఆర్.ఓలకు సూచించారు. కలెక్టర్ వెంట జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమా సింగ్, సహాయక రిటర్నింగ్ అధికారి సాయిరాం, సంబంధిత అధికారులు ఉన్నారు.



ఎన్నికల విధుల్లో పాల్గొనేందుకు చేవెళ్లలోని డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌కు వచ్చిన ఉద్యోగులు



## పోలింగ్ ప్రక్రియ ఇలా..

సిటీబ్యూరో, మే 12 (నమస్తే తెలంగాణ): తొలుత రిటర్నింగ్ అధికారుల ఆధీనంలో ఉన్న ఈవీఎంలను సోమవారం(నేడు) ప్రిసైడింగ్ అధికారి (పీవో) సారథ్యంలో పోలింగ్ కేంద్రాల్లో అమర్చుతారు. అనంతరం ఉదయం 5 గంటలకు పోటీలో ఉన్న అభ్యర్థుల తరపున వచ్చిన ఏజెంట్ల సమక్షంలో మాక్ పోలింగ్ నిర్వహిస్తారు. ఉదయం 6 గంటల్లోగా మాక్ పోలింగ్ ముగిస్తారు. ఏజెంట్లు అన్ని పరిశీలించి.. వారు ఒకే అంటేనే ఈవీఎంలను ఓటింగ్‌కు ఉపయోగిస్తారు. ఏవైనా సందేహాలుంటే రిజర్వ్ చేసిన ఈవీఎంలను పరీక్షించి.. ఏజెంట్లు ఒప్పుకుంటే వాటిని ఓటింగ్‌కు వాడతారు. ఓటర్లలో పురుషులు, మహిళలు, ట్రాన్స్‌జెండర్లు ఇలా మూడు రకాల వారుంటారు. ఓటు వేసేందుకు వచ్చినప్పుడు అదనపు ప్రిసైడింగ్ అధికారి ప్రత్యేక గుర్తులతో మార్కింగ్ చేస్తారు. పోలింగ్ గడువు ముగుస్తుందనే అంశాన్ని 15 నిమిషాల ముందే ప్రిసైడింగ్ అధికారి ప్రకటించాల్సి ఉంటుంది. సాయంత్రం 6 గంటల్లోపు పోలింగ్ కేంద్రంలో ఉన్న వారందరూ ఓటు వేయడానికి అర్హులు. పోలింగ్ కేంద్రంలో ఓటింగ్ మొదలైనప్పటి నుంచి ప్రతి రెండు గంటలకొకసారి పోలింగ్ శాతాన్ని ఎన్నికల అధికారులు వెల్లడిస్తారు.

### గ్రేటర్ ఓటింగ్ శాతం ..పెరిగేనా..?

ఎన్నికలు ఏవైనా గ్రేటర్‌లో ఉండే ఓటర్లు గడప దాటకపోవడంతో ప్రతిసారీ అత్యల్ప ఓటింగ్ నమోదవుతున్నది. ఓటింగ్ శాతాన్ని పెంచేందుకు అధికారులు చర్యలు తీసుకున్నా.. ఇప్పటికే సొంతూళ్లకు సిటీ జనాలు వెళ్లిపోవడంతో ఈసారి ఓటు హక్కును ఎంతమంది వినియోగించుకుంటారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో పలు నియోజకవర్గాల్లో 50 శాతంలో ఓటు హక్కును సద్వినియోగం చేసుకున్నారు. అయితే పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా గ్రేటర్ ఓటర్లు ఎంతమంది ఓటేస్తారనేది చర్చనీయాంశంగా మారింది.

## పటిష్ట బందోబస్తు

**వికారాబాద్ ఎస్పీ కోటిరెడ్డి**



వికారాబాద్, మే 12 : ఎన్నికల్లో ఎలాంటి అలజడులు, అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా అన్ని రకాల ముందు జాగ్రత్త చర్యలను తీసుకున్నామని వికారాబాద్ ఎస్పీ కోటిరెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నికల దృష్ట్యా జిల్లాలో 45 కంపెనీల కేంద్ర బలగాలు, 14 కంపెనీల టీఎస్ఎస్పీ బలగాలు, 750 మంది కర్ణాటక పోలీస్, జిల్లా శిక్షణా కేంద్రంలో శిక్షణ తీసుకుంటున్న 260 మంది శిక్షణా పోలీస్ అధికారులు, 800 మంది జిల్లా పోలీస్ అధికారులతో బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అత్యవసర సమయంలో స్పందించుటకు 19 స్ట్రైకింగ్ ఫోర్స్ టీం లు, 4 స్పెషల్ స్ట్రైకింగ్ ఫోర్స్ టీంలు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. సున్నితమైన, అతి సున్నితమైన పోలింగ్ కేంద్రాల్లో సీసీ టీవీలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఎన్నికల విధుల్లో పాల్గొనే పోలీస్ అధికారులు, సిబ్బందికి చేయాల్సిన, చేయకూడని పనులను వివరించినట్లు చెప్పారు. ఎవరైనా పోలింగ్ అధికారులను ఇబ్బందులకు గురిచేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ హెచ్చరించారు.

## కార్మికులకు వేతనంతో కూడిన సెలవు

**కార్మిక శాఖ అసిస్టెంట్ కమిషనర్ శ్రీనివాస్‌రావు**



వికారాబాద్, మే 12 : మే 13న సార్వత్రిక ఎన్నిక జరుగుతున్నందున వికారాబాద్ జిల్లాలో పనిచేస్తున్న కార్మికులందరికీ వేతనంతో కూడిన సెలవు మంజూరు చేసినట్లు కార్మిక శాఖ అసిస్టెంట్ కమిషనర్ శ్రీనివాస్ రావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. దీనికనుగుణంగా వాణిజ్య సంస్థలు, ఫ్యాక్టరీలు తదితర అన్ని సంస్థలకు సెలవు ప్రకటించాలని కార్మిక శాఖ ఉత్తర్వులు జారీ చేసిందని తెలిపారు. ఉల్లంఘించిన దుకాణాలు, సంస్థలు, యాజమాన్యాలపై కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు. కార్మికులు ఎవరికైనా సెలవు మంజూరు చేయనట్లయితే కార్మిక శాఖ టోల్ ఫ్రీ నెంబర్ 94925 55290ను సంప్రదించాలని సూచించారు.

## పటిష్ట బందోబస్తును ఏర్పాటు చేయాలి

**కడ్తాల్ పోలీస్ స్టేషన్‌తోపాటు పోలింగ్ కేంద్రాలను సందర్శించిన సైబరాబాద్ సీపీ**



పోలీసులకు సూచనలు చేస్తున్న సైబరాబాద్ సీపీ అవినాశ్ మహంతి

కడ్తాల్, మే 12 : మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌తోపాటు పోలింగ్ కేంద్రాలను సోమవారం రాత్రి సైబరాబాద్ పోలీస్ కమిషనర్ అవినాశ్ మహంతి సందర్శించారు. ఈ సందర్భంగా పోలీసు సిబ్బందికి సూచనలు చేశారు. సమస్యాత్మక గ్రామాల్లో పటిష్ట బందోబస్తును ఏర్పాటు చేయాలని సూచించారు. పోలింగ్ కేంద్రాల వద్ద 144 సెక్షన్‌ను పకడ్బందీగా అమలు చేయాలని పేర్కొన్నారు. ఓటర్లను ప్రలోభాలకు గురి చేసే, గొడవలు చేసేవారిపై ప్రత్యేక నిఘా ఉంచాలన్నారు. ఫాంహౌస్‌లు, లాడ్జిలను తనిఖీ చేయాలన్నారు. ఆయన వెంట శంషాబాద్ డీసీపీ నారాయణరెడ్డి, అడిషనల్ డీసీపీ రామ్‌కుమార్, సీఐ శివప్రసాద్, సిబ్బంది ఉన్నారు.

# వేసవి దుక్కులు.. సాగు బాగు

- చీడపీడలు, కలుపు నివారణకు దోహదం
- లోతుగా దున్నితే అధిక దిగుబడులు
- వానకాలం పంటల సాగుకు సమాయత్తమవుతున్న జిల్లా రైతాంగం



వేసవి దుక్కుల కోసం పంట పొలాలను సిద్ధం చేస్తున్న రైతులు

ఇబ్రహీంపట్నంరూరల్, మే 12 : వేసవిలో పొలాలను దున్నుకోవడంతో కలుపు, చీడపురుగులు నశిస్తాయని, పొలం కూడా మెత్తబడి అధిక దిగుబడి పొందవచ్చనే అధికారుల సూచనలతో అన్నదాతలు పనులు మొదలుపెట్టారు. ప్రస్తుతం పొలాల్లో ఎలాంటి పంటలు లేనందున లోతుగా దుక్కులు దున్నుకుంటే ఏ పంట వేసినా అధిక దిగుబడి ఎక్కువగా సాధించవచ్చని అధికారులు చెబుతున్నారు. దీంతో జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో దున్నడం ప్రారంభించి వానకాలానికి పొలాలను సిద్ధం చేస్తున్నారు. కొందరు రైతులు ఇప్పుడిప్పుడే వరి పంటలు కోసి పొలాలను శుద్ధి చేస్తున్నారు. ప్రభుత్వం అందించే సబ్సిడీలను వినియోగిస్తూ అధికారుల సూచనలతో పంటలు సాగు చేస్తే వ్యవసాయం మంచి లాభసాటిగా మారుతుందని చెబుతున్నారు వ్యవసాయాధికారులు.

### వేరు విస్తరించే అవకాశం

వేసవిలో లోతుగా దుక్కులు దున్ని తొలకరి జల్లులు కురిసిన తర్వాత గొర్రు తిప్పి సేద్యం చేస్తే వేర్లు బాగా విస్తరించడానికి అనుకూలంగా ఉంటుంది. నేల అధికంగా నీటిని పీల్చుకుంటుంది. సేద్యానికి ఉపయోగించే గొర్రు, గుంటక, దంతెల వంటి పరికరాలు నేల లోపలికి 3 నుంచి 6 అంగుళాల వరకు చొచ్చుకుని పోతాయి. ఈ పరికరాలు తరచూ ఉపయోగించడం వలన నేల లోపల సుమారు 3 నుంచి 5 అంగుళాల లోతులో ఒక గట్టి పొర ఏర్పడుతుంది. దీంతో నేలకు నీటిని పీల్చుకునే శక్తి తగ్గుతుంది. కావున వేసవి దుక్కుల సమయంలో నేలను లోతుగా దున్నినప్పుడు ఈ గట్టి పొర ఛేదించబడి నేలకు నీటిని పీల్చుకునే శక్తి అధికమవుతుంది.

### దుక్కులు లోతుగా దున్నుకోవాలి

దుక్కులను లోతుగా దున్నడం వల్ల నేల వదులై మెత్తగా తయారవుతుంది. తొలకరి వర్షాలు పడిన వెంటనే నీరు పల్లంవైపు పొర్లకుండా ఎక్కడికక్కడే పొలంలోనే ఇంకిపోతుంది. భూమికి ఎక్కువ రోజులు తేమ నిల్వ చేసుకునే సామర్థ్యం పెరుగుతుంది. దీనివల్ల పైరు వేసిన తర్వాత వర్షాలు పడటం కొద్దిగా ఆలస్యమైనా పంటకు నష్టం జరుగదు. పంటల కోతల తర్వాత నేలపై మిగిలే పంట మొదళ్లు, పొలంలో మిగిలిన కలుపు మొక్కలు, పంటల నుంచి రాలిపడిన ఆకుల వంటి వివిధ సేంద్రియ పదార్థాలన్నీ లోతు దుక్కి దున్నినప్పుడు నేలలో కలిసి కుళ్లిపోయి ఎరువుగా మారుతాయి. దీంతో నేలలో సేంద్రియ పదార్థాలు, పోషక విలువలు పెరుగడానికి అవకాశం ఉంటుంది. లోతు దక్కులు దున్ని సిద్ధం చేసుకుంటే వానకాలానికి ఎంతో అనుకూలంగా ఉంటుందని వ్యవసాయాధికారులు చెబుతున్నారు.

### మందలు పెట్టుకుంటే పొలానికి ఎంతో బలం

వేసవిలో పొలాల్లో ఎలాంటి పంటలు ఉండవు. కాబట్టి రైతులు వేసవిలో తమ పొలాల్లో పశువులు, గొర్రెల మందలు పెట్టుకుంటే మంచిది. పశువులు, గొర్రెలను పొలంలో మందలు కట్టడం రైతులకు పాత విషయమే, కాబట్టి ఆ పని వేసవిలో చేస్తే ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. పొలంలో మందలను కట్టిన సమయంలో మల, మూత్రాలు విసర్జిస్తాయి. దీంతో చేనుకు అవసరమైనంత ఎరువు లభించి పొలానికి అదనపు బలం చేకూరుతుంది.



### మొండిజాతి కలుపు నివారణ

పొలాల్లో వేసవి దుక్కులు దున్నినప్పుడు కలుపు మొక్కలు, కాయలు, వేర్లు, దుంపలు పెకిలించబడి వేసవిలో ఉండే ఉష్ణోగ్రతలకు అవి నశించడానికి ఆస్కారం ఉంటుంది. దుక్కి దున్నిన తర్వాత నేల పైకి తేలిన కాయలు, దుంపలు ఏరివేసుకుంటే పొలం శుభ్రంగా తయారవుతుంది. తుంగ, గరిక, గుంజర వంటి మొండిజాతి కలుపు మొక్కలు పొలంలో అధికంగా పెరిగి పంటలను నాశనం చేస్తుంటాయి. కాని వేసవి దుక్కులు లోతుగా తీయడంతో పొలంలోని చీడలు నాశనమయ్యే అవకాశమున్నందున రైతులు అధికారుల సూచనల మేరకు జాగ్రత్తలు పాటించాలని వ్యవసాయాధికారులు కోరుతున్నారు.

### అధిక దిగుబడులకు అవకాశం



వేసవిలో దుక్కులను లోతుగా దున్నుకుంటే తొలకరిలో కురిసే వర్షాలకు నీరు భూమిలో ఇంకిపోయి పొలం తడిగా మారే అవకాశం ఉంటుంది. రైతులు వరి పంటలు కోయడంతో పాటు ఇతర పొలాల్లో ఎలాంటి పంటలు లేనందున దుక్కి దున్నాలి.

**- శ్రవణ్‌కుమార్, ఏఈవో, ఇబ్రహీంపట్నం వ్యవసాయశాఖ**

### ఎండలో దున్నితే భూమికి బలం



పంటలు తీసుకున్న తర్వాత వెంటనే భూములు దున్నితే భూమికి బలం చేకూరుతుంది. రాలిన ఆకులతో భూమికి మల్చింగ్ చేసినట్లు అవుతుంది. అప్పుడే భూమి బాగా మరిగి పంటల దిగుబడి ఎక్కువగా వస్తుంది. వరి పంట కోసిన వెంటనే పొలం దుక్కులు దున్ని పెట్టుకుంటే వర్షాలు పడే నాటికి భూమిలో మంచి బలం చేకూరుతుంది. తొలకరి పలుకరించిన వెంటనే ఎలాంటి పంటలు వేసుకున్నా దిగుబడి బాగుంటుంది.

**- వంగేటి లక్ష్మారెడ్డి, రైతు సంఘం నాయకుడు**

# ఓటు కోసం..

- గ్రామాలకు చేరుకోవడానికి ఇబ్బందిపడ్డ జనం
- కొడంగల్‌కు ప్రత్యేక బస్సులు
- ఇతర ప్రాంతాలకు వెళ్లే రూట్లలో బస్సులు అంతంత మాత్రమే..
- బస్సులు సరిపోక ప్రైవేట్ వాహనాల్లో వెళ్లిన వలస కూలీలు



మొయినాబాద్ బస్ స్టాప్‌లో బస్ ఎక్కడానికి ఎగబడుతున్న ప్రయాణికులు

మొయినాబాద్, మే 12 : ఎన్నికల్లో ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవడానికి బతుకుదెరువు కోసం వలస వచ్చిన కూలీలు తమ సొంత గ్రామాలకు చేరుకున్నారు. సరిపడా బస్సులు లేకపోవడంతో చాలా ఇబ్బందులు పడ్డారు. నగరం నుంచి బస్సుల్లో నిండుగా రావడంతో పాటు కొన్ని ప్రత్యేకంగా కొడంగల్‌కు బస్సులు వేయడంతో.. అలాంటి బస్సులను మొయినాబాద్‌లో ఆపకుండ వెళ్లిపోయారు. కొందరు తమ స్వస్థలాలకు చేరుకోవడానికి ప్రైవేట్ వాహనాలను ఆశ్రయించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు చాలా అవస్థలు పడ్డారు. ప్రయాణికుల అవసరాలను గమనించిన ప్రైవేట్ వాహనదారులు రెండింతల చార్జీలు వసూలు చేశారు.

నియోజకవర్గ ప్రజలు ఓటు హక్కు వినియోగించుకోవడం కోసం సీఎం రేవంత్‌రెడ్డి నియోజకవర్గం కొడంగల్‌కు ఆర్టీసీ అధికారులు ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేశారు. డిస్ట్రిక్ట్ బస్సులతో పాటు హైదరాబాద్ మహానగరంలో నడిచే సిటీ సబర్బన్, మెట్రో బస్సులను నడిపించారు. ప్రత్యేక బస్సులు వేసినా కొడంగల్, కోస్గి వెళ్లేవారికి సరిపోలేదు. ఆ ప్రాంత జనం ప్రైవేట్ వాహనాల్లో డ్రైవర్లు ఎంత అడిగితే అంత ఇచ్చి సొంత గ్రామాలకు చేరుకున్నారు. కొడంగల్‌కు వెళ్లే బస్సులు 10 నిమిషాలకు ఒకటి వెళ్లాయి. కానీ వికారాబాద్, తాండూరు ప్రాంతాలకు బస్సులను అంతంత మాత్రమే నడిపించారు. బస్సులు సరిగ్గా రాక.. ఎండను తట్టుకోలేక ప్రయాణికులు రోడ్డు డివైడర్ మధ్యలోని చెట్ల కింద, దుకాణాల ఎదుట సేద తీరారు.

# ఆదాయానికి గండికొడుతున్న 'మహాలక్ష్మి'



## మెట్రో నడిపేదెలా?

- ప్రశ్నార్థకంగా మెట్రో మనుగడ
- 2026 నాటికి విక్రయించాలని యోచన
- ఐదేండ్ల పాటు 'ఫ్రీ బస్సు' అమలు చేస్తే.. ప్రయాణికుల సంఖ్య ఆశించిన స్థాయిలో పెరగదనే అంచనా
- స్టేషన్లలో ఖాళీగా వ్యాపార స్థలాలు

సిటీబ్యూరో, మే 12 (నమస్తే తెలంగాణ): ప్రపంచంలోనే అతి పెద్ద పబ్లిక్ ప్రైవేట్ పార్టనర్‌షిప్ ప్రాజెక్టు. ఎంతో దూర దృష్టితోనే సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్)కు రూపకల్పన. ఎన్నో అడ్డంకులను ఎదుర్కొని అందుబాటులోకి.. ఇంతటి ప్రాముఖ్యత కలిగిన హైదరాబాద్ మెట్రో రైలు ప్రాజెక్టుపై నీలి నీడలు కమ్ముకుంటున్నాయి. ముందుగా రూపొందించుకున్న ప్రణాళిక ప్రకారం.. ప్రాజెక్టు పూర్తయి అందుబాటులోకి వచ్చిన ఐదేండ్ల తర్వాత లాభాలు వస్తాయనుకుంటే, అంచనాలను తలకిందులు చేస్తూ నష్టాలను మూటకట్టుకుంటున్న పరిస్థితులు నెలకొన్నాయి. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత.. ఫ్రీ బస్సు ప్రయాణం పేరుతో ప్రారంభించిన మహాలక్ష్మి పథకం..మెట్రో రైళ్లలో ప్రయాణించే వారి సంఖ్యపై తీవ్ర ప్రభావం చూపుతోంది. ఉచిత బస్సు పథకాన్ని ఐదేండ్ల పాటు అమలు చేస్తే..మెట్రోలో ప్రయాణించే వారి సంఖ్యలో పెరుగుదల ఆశించిన స్థాయిలో ఉండదని మెట్రో అధికారులు అంచనా వేస్తున్నారు.

### తారుమారైన అంచనాలు...

హైదరాబాద్ మెట్రో ప్రాజెక్టు ద్వారా వచ్చే ఆదాయాన్ని మూడు మార్గాల్లో రాబట్టుకోవాలని పక్కా ప్రణాళికతో ముందుకు అడుగు వేసి సుమారు రూ.16వేల కోట్లను ఎల్ అండ్ టీ మెట్రో రైలు హైదరాబాద్ సంస్థ ప్రాజెక్టు నిర్మాణం చేపట్టింది. మూడు కారిడార్లలో మెట్రో రైళ్ల రాకపోకలు సాగిస్తున్నాయి. టికెటింగ్‌తో 50 శాతం, రియల్ ఎస్టేట్ కార్యకలాపాల ద్వారా 45 శాతం, వ్యాపార ప్రకటనలు ద్వారా ఆదాయం పొందాలని ఎల్ అండ్ టీ మెట్రో సంస్థ అంచనాలు వేసుకున్నది. ఐదేండ్ల తర్వాత మెట్రో రైళ్లలో ప్రయాణికుల సంఖ్య క్రమంగా పెరిగి.. ఆ తర్వాతి నుంచి లాభాలు వచ్చేందుకు అవకాశం ఉంటుందని వేసుకున్న అంచనాలు ఇప్పుడు తారుమారయ్యాయి. మెట్రో సేవలు ప్రారంభమై.. ఆరేండ్లు పూర్తయ్యే నాటికి మెట్రో ప్రయాణికుల సంఖ్య ఒక్కసారిగా 5 లక్షల నుంచి 5.5 లక్షల దాకా పెరిగింది. ఆ తర్వాత కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో అంచనాలు తలకిందులయ్యాయి.

### 4.80 లక్షలకు పడిపోయిన ప్రయాణికులు...


హైదరాబాద్ మెట్రో రైలు రైడర్‌షిప్ ఆరేండ్లు పూర్తయ్యే నాటికి దాదాపు 5 లక్షలకు చేరుకుంది. కారిడార్-1( ఎల్బీనగర్-మియాపూర్) మార్గంలో రోజుకు దాదాపు 2.45 లక్షలు, కారిడార్-3 (నాగోల్-రాయదుర్గం)లో 2.30 లక్షల మంది, కారిడార్-2 (జేబీఎస్-ఎంజీబీఎస్) మార్గంలో 35 వేల మంది ప్రయాణం చేస్తున్నారు. గతేడాది నవంబర్ 2023 నాటికి.. హైదరాబాద్ మెట్రో రైలులో రోజువారీ ప్రయాణికుల సంఖ్య 5 లక్షల నుంచి 5.5 లక్షల మంది గరిష్ఠ స్థాయికి చేరుకుంది. అలాంటిది కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన డిసెంబర్ 7 తర్వాత నుంచి మహిళలకు అమలు చేసిన ఉచిత ఆర్టీసీ ప్రయాణం పథకంతో మెట్రోలో రోజువారీ ప్రయాణికుల సంఖ్య సుమారు 4.80 లక్షలకు పడిపోయింది.

### రియల్ ఎస్టేట్ నుంచి ఆదాయం రాలే...

మెట్రో రైలు ప్రాజెక్టులో రియల్ ఎస్టేట్ అంశం అత్యంత కీలకమైంది. హైదరాబాద్ మెట్రో రైలు ప్రాజెక్టులో భాగంగా నిర్మించిన రవాణా ఆధారిత అభివృద్ధి కేంద్రాలు మెట్రోమాల్స్, మెట్రో స్టేషన్‌లలోని వ్యాపార సంస్థలకు అద్దెకు ఇచ్చే స్థలాలు. ఇతర ప్రాంతాల్లో రాష్ట్ర ప్రభుత్వం కేటాయించిన భూముల ద్వారా 45 శాతం ఆదాయం రావాల్సి ఉంది. ప్రాజెక్టులో భాగంగా మొత్తం 4 మాల్స్‌ను నిర్మించారు. వీటి నుంచి ఆశించిన స్థాయిలో ఆదాయం రాకపోవడంతో అన్ని మాల్స్‌ను ఒకేసారి దీర్ఘకాలిక లీజుకు ఇవ్వడం ద్వారా పెద్ద మొత్తంలో నిధులను సమకూర్చుకునేందుకు ఎల్ అండ్ టీ సిద్ధమైంది.

**2026 నాటికి..**

ఇక మూడు కారిడార్‌లలో నిర్మించిన 59 మెట్రో స్టేషన్లలో వ్యాపార సంస్థలకు లీజుకు ఇచ్చేందుకు వీలుగా నిర్మించిన స్థలాల్లో సింహ భాగం ఖాళీగానే ఉంది. కేవలం మియాపూర్, ఎల్బీనగర్, రాయదుర్గంలతో పాటు అమీర్‌పేట, ఎంజీబీఎస్, పరేడ్‌గ్రౌండ్-జేబీఎస్ మెట్రో స్టేషన్‌లలోనే వ్యాపార సంస్థల కార్యకలాపాలు కొనసాగుతున్నాయి. మిగతా స్టేషన్లలో 90 శాతం స్థలాలు ఖాళీగానే ఉన్నాయి. ఇదిలా ఉంటే ఐదేండ్ల పాటు ఫ్రీ బస్సు పథకాన్ని అమలు చేస్తే..మెట్రో ప్రయాణికుల సంఖ్య ఆశించిన స్థాయిలో పెరగదనే అంచనాకు వచ్చిన ఎల్ అండ్ టీ సంస్థ..2026 నాటికి ప్రాజెక్టు మొత్తాన్నే విక్రయించాలన్న ఆలోచన చేస్తోంది. ఇదే విషయాన్ని ఆ సంస్థ ప్రతినిధి ఇటీవల ఓ టీవీ చానల్ ఇంటర్వ్యూలో పేర్కొన్నారు.




### ఓటు హక్కు వినియోగంపై సోషల్ మీడియాలో ప్రచారం

'ఎన్నికల కమిషన్ ఇచ్చిన ఏదైనా గుర్తింపు కార్డును వెంట తీసుకురావడం మరవొద్దు' అంటూ ఓటు హక్కు వినియోగంపై లగ్గం పత్రిక తరహాలో రూపొందించిన కార్డు సోషల్ మీడియాలో విస్తృతంగా చక్కర్లు కొడుతున్నది. సామాజిక మాధ్యమాల వేదికగా ఓటు హక్కు వినియోగంపై విస్తృతంగా ప్రచారం జరుగుతున్నది. ఓటు హక్కు ప్రతి ఒక్కరి బాధ్యతని, పోలింగ్ రోజును సెలవు దినంగా కాదు, మన భవిష్యత్తుకు పునాదిగా భావించాలని పిలుపునిస్తూ కొటేషన్లు వస్తున్నాయి.

**– పెద్దఅంబర్‌పేట**